# ప్రజా మారటిఖ

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 289 పేజీలు : 04 వెల రూ. 2 శనివారం 23 - 05 - 2026




తెలంగాణలో అత్యధిక జిల్లాల్లో 44 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

# వ్యవసాయ రంగంలో లక్ష్యాలను మించి రుణాలు

- మహిళా సంఘాలకు రుణాలపై భట్టివిక్రమార్క శుభవార్త
- వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామన్న భట్టివిక్రమార్క
- సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి వాటికి ప్రాధాన్యత
- వ్యవసాయ రంగంలో లక్ష్యాలను మించి రుణాలు ఇస్తున్నాయని బ్యాంకులకు కితాబు



**హైదరాబాద్ :** మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. ప్రజాభవన్‌లో 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లుభట్టి విక్రమార్క మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవనం వంటి అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అన్నారు. ఈ క్రమంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళలు, దళిత, గిరిజన, యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలని అన్నారు. - మిగతా 2 లో

## బండి భగీరథ్ అరెస్టు విషయంలో రేవంత్ రెడ్డి అలా, బండి సంజయ్ ఇలా



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు
- బండి సంజయ్ లొంగుబాటు అంటే, రేవంత్ రెడ్డి అరెస్టు అంటున్నారని ఆగ్రహం
- ఇద్దరు తోడు దొంగలు కలిసి డ్రామాలు ఆడుతున్నారని విమర్శ

## తెలంగాణలో అంగన్‌వాడీ కొలువులు

- 15,982 పోస్టుల భర్తీకి సర్కార్ సన్నాహాలు
- మొత్తం ఖాళీల్లో 12,882 హెల్పర్, 3,100 టీచర్ పోస్టులు
- ఈ ఏడాదిలోనే కలెక్టర్ల ఆధ్వర్యంలో నియామక ప్రక్రియ ప్రారంభం
- త్వరలో విడుదల కానున్న నియామక మార్గదర్శకాలు

# ప్రభుత్వ ఖజానాకు ఆర్బీఐ బూస్ట్

- రూ.3 లక్షల కోట్లకు పైగా మిగులు నిధులు?
- కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ బదిలీపై నేడు ఆర్బీఐ బోర్డు సమావేశం
- గతేడాది రికార్డును మించి రూ.3 లక్షల కోట్ల వరకు మిగులు నిధుల అంచనా
- ప్రభుత్వ ఆర్థిక లోటును అదుపులో ఉంచేందుకు ఈ మొత్తం కీలకం
- గతేడాది ఫారెక్స్ నిల్వలపై వచ్చిన ఆదాయంతో రికార్డు డివిడెండ్ అందిన వైనం



**ఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మరోసారి భారీ కానుక అందించేందుకు సిద్ధమవుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వానికి బదిలీ చేయాల్సిన మిగులు నిధులపై (డివిడెండ్) తుది నిర్ణయం తీసుకునేందుకు ఆర్బీఐ సెంట్రల్ బోర్డు నేడు సమావేశమవుతోంది. ఈసారి డివిడెండ్ మొత్తం గత ఏడాది రికార్డును అధిగమించి రూ.3 - మిగతా 2 లో

## కొత్త వేగాన్ని అందించడానికి రెడీ



- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- భారత్, సైప్రస్ సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి
- ఉగ్రవాదం కట్టడికి జాయింట్ వర్కింగ్ గ్రూప్
- ఇది భవిష్యత్ దృష్టితో కూడుకున్న అనుబంధం
- ప్రధాని మోదీ- భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం

**ఢిల్లీ :** భారత్, సైప్రస్‌లు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడించారు. భారత్, సైప్రస్ అనుబంధం కాలపరీక్షల్లో పదేపదే నిలుస్తూ వచ్చిందని ఆయన తెలిపారు. ఇప్పుడు - మిగతా 2 లో

## హర్మూజ్ మూసివేత మరింత కాలం కొనసాగితే చమురు ధరలు భారీగా పెరగొచ్చు!




- డేటా అనలటిక్స్ సంస్థ ఉడ్ మెకంజీ నివేదిక వెల్లడి
- గల్ఫ్ దేశాల నుంచి నిలిచిపోయిన 11 మిలియన్ బ్యారెళ్ల మూడి చమురు సరఫరా
- జూన్ నాటికి పశ్చిమాసియాలో సమస్య తగ్గితే 80 డాలర్లకు బ్రెంట్ క్రూడ్ ధర

**ఢిల్లీ :** ఇరాన్-అమెరికా యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ జలసంధి మూతపడటంతో ముడి చమురు ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. ఒకవేళ పరిస్థితి ఇలాగే కొనసాగితే చమురు ధరలు మరింత పెరిగే అవకాశముందని డేటా అనలటిక్స్ సంస్థ ఉడ్ మెకంజీ పేర్కొంది. హర్మూజ్ జలసంధి మూసివేత ఇలాగే కొనసాగితే బ్యారెల్ - మిగతా 2 లో




## మా బ్రాండ్ ఉద్యోగాల కల్పన అయితే, మీ బ్రాండ్ గొడ్డలి



- ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్
- జమ్మలమడుగులో రూ.3 వేల కోట్ల ఎస్ఏఈఎల్ సోలార్ ప్రాజెక్టును ప్రారంభించిన మంత్రి లోకేష్
- ఇది దార్శనికత, నమ్మకం, వేగానికి ప్రతిరూపమని వ్యాఖ్య
- మా బ్రాండ్ ఉద్యోగాల కల్పన అయితే, మీ బ్రాండ్ గొడ్డలి అంటూ పరోక్ష విమర్శలు

**అమరావతి :** ఒక ప్రాజెక్టు ప్రారంభమవ్వడమంటే కేవలం రిబ్బన్ కటింగ్ కాదని, అది దార్శనికత, నమ్మకం, వేగం, కార్యనిర్వహణల కలయిక అని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. శుక్రవారం జమ్మలమడుగు నియోజకవర్గం, కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో రూ.3,000 కోట్లతో నిర్మించిన సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ (రాూజూా) వారి 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు - మిగతా 2 లో

# అగ్నిగుండంలా ఆంధ్రప్రదేశ్

- సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాల్పులపై సీఎం చంద్రబాబు సమీక్ష
- చలివేంద్రాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశం
- తీవ్ర ఉష్ణోగ్రతలున్న ప్రాంతాల్లో స్థానికంగా సెలవులు ప్రకటించాలని సూచన
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలని స్పష్టం
- ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం



**అమరావతి :** రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు నిరంతరం హెచ్చరికలు పంపాలని సూచించారు. ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను బట్టి స్థానికంగా - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఆమ్ రస్

బహదూర్‌షా జఫర్‌తో కలిసి మీర్జా గాలిబ్ తోట షికారుకు బయలుదేరాడు. తోటంటే మామిడి తోటే. అది విరగ కాసి ఉంది. మీర్జా గాలిబ్ ప్రతి పండునూ కళ్లు చికిలించి మరీ చూస్తూ ఉన్నాడు. అతని పోబడి కాసేపు పరికించి 'ఏమిటయ్యా మీర్జా, అలా చూస్తున్నావు' అన్నాడు జఫర్. 'జహాపనా! ప్రతి పండు మీద తినేవాడి పేరు ఉంటుందని అంటారు. నా పేరు రాసిన పండ్లు ఏవై ఉంటాయా అని వెతుకుతున్నా' అన్నాడు మీర్జా. జఫర్ ముచ్చటగా నవ్వి ఆ సాయంత్రం మీర్జా ఇంటికి బుట్టల కొద్ది పండ్లు పంపాడు. పేరుకు మహాకవి మీర్జా గాలిబ్... తియ్యటి మామిడి కోసం తన కవిత్వం మొత్తం ఖుర్బాన్ చేయమన్నా చేస్తాడు.బాబర్ ఇండియా మీదకు దండెత్తి వచ్చాక 'నేను నా నేలన తిన్న తియ్యటి ద్రాక్ష ఏదీ? ఆ మధుర కర్బూజా ఫలము ఎక్కడ?' అని ఏడ్చినంత పని చేశాడు. 'ఊరుకో స్వామీ' అని ఇక్కడి స్థానికులు మామిడి పండు కోసి పెట్టారు. తర్వాత బాబర్ 'సరైన మామిడి దొరకాలేగానీ దాని అబ్బలాంటి కాయ మరేదీ లేదు' అని బాబర్ నామాలో రాసుకున్నాడు. సరే. 'నూర్జహాన్' పేరు మీదే ఒక పండు అంకితం చేయబడింది. అక్బర్ మహాశయుడైతే మామిడికి దాసుడు. బిహార్‌లోని దర్భంగా దగ్గర లక్ష మామిడి చెట్లతో తోట వేశాడు. దాని పేరు 'లఖీ బాగ్'. మొఘలులతో పని జరగాలంటే మామిడి పండ్ల బుట్ట ఇస్తే సరి అనే నానుడి ఉండేది. అందుకే అమీర్ ఖుస్రో మామిడిని 'ఫఖర్‌ఏగుల్షన్'... 'తోటలకు గర్వకారణం' అని కీర్తించాడు. కర్నూలు జిల్లా బనగాన పల్లిలో నవాబులు తమ మామిడి తోటలన్నీ శోధించి శ్రేష్ఠమైన 'బేనిషాన్' వెరైటీని వృద్ధి చేసి రైతులకు మొక్కలు ధారాళంగా పంచారు. ఇవాళ తింటున్న బంగినపల్లి తీపికి మొదలు అక్కడ ఉంది.మామిడి మనదే. ఆరు వేల ఏళ్ల చరిత్ర ఉంది దానికి. ఈశాన్య భారతంలో పుట్టి బౌద్ధ సన్యాసుల వల్ల, పర్షియన్ వర్తకుల వల్ల, పోర్చుగీసు వాళ్ల వల్ల ప్రపంచానికి పాకింది. ఇవాళ ఏ దేశంలో మామిడి ఉన్నా దాని వేరు మనదే. వేదాల్లో 'ఆమ్ర' అని ప్రస్తావన ఉందట. భూమి చుట్టడానికి బదులు తన చుట్టూ తిరిగిన వినాయకుణ్ణి మెచ్చి శివుడు మామిడి పండును బహుమతిగా ఇచ్చాడట. అంటే అది జ్ఞానఫలం. ఇక బుద్ధునికి ఆమ్రపాలి తన మామిడి తోట దానం చేయడం విదితమే. జైన మహావీరుడు 30 ఏళ్ల వయసులో ఇల్లు వదిలి 'జ్ఞాతృఖండ వనం' అనే మామిడితోటలో దీక్ష తీసుకున్నాడు. వినోదానికేం కొదవ? రాయలవారి తల్లికి మామిడి పండ్లు దానం చేయాలని ఉండే దట. అది తీరకనే పోయేసరికి 'ప్రాయశ్చిత్తంగా బంగారు మామిడిపండ్లు ఇస్తేనే స్వర్గప్రాప్తి' అని హాతాయించిన వారికి తెనాలి రామలింగడు ఇనుప కడ్డీలతో వాతబడి చేశాడని జనశ్రుతి. 2000 ఏళ్ల క్రితమే తెలుగునేలకు మామిడిగాలి సోకినా రాయలవారి కాలానికి మామిడి ఛాయ స్థిరపడింది. రాయలవారే స్వయంగా తోటలు పెంచాడు. ఆముక్తమాల్యదలో మామిడి చివురు ప్రస్తావన చేశాడు.మామిడి పండ్లు వచ్చేది ఎందుకంటే జీవితం కాసింత రసభరితం చేసుకోండయ్యా అని గుర్తు చేయడానికి. ఎండ ఉదయాన కుటుంబంతో అల్పాహారానికి కూచుని చద్దన్నంలో మామిడి రసం జుర్రుకుంటూ, వేడివేడి పూరీలను మామిడి రసంలో ముంచు కుంటూ, సువర్ణకాంతిలో మెరిసే మామిడి ముక్కల మెరుపుతో ముఖాన్ని శోభిస్తూ, జిహ్వకు స్వర్గం అందడం అంటే ఏమిటో అనుభవిస్తూ బతుకును కాస్త రుచిమధురం చేసుకోమని చెప్తుంది మామిడి కాలం. కానీ ఏమిటి చేయడం! మంచి కాయలన్నీ విదేశా లకు పంపి, కల్మష కాయలన్నీ బజారున ఒంపారు. చిన్నప్పుడు తిన్న మేలిమి రకాలెన్నో శ్రీమంతుల డైనింగ్ టేబుల్స్‌కు పరిమితమయ్యాయి. ఇటు తీపి రుచికి నోచుకోక... అటు బతుకు బాదరబందీలో కుదురు దొరక్క... రుచీ పచీ లేక మిగిలాం. గడ్డి కప్పి, మగ్గబెట్టి, వెతికి వెతికి అందుకుని తిన్న చిన్నప్పటి జ్ఞాపకం ఏమైంది?లోకాన మంచిగాని, మామిడి రుచిగాని బహు కొద్ది. అందువల్ల దొరికిన ప్రతి లిప్తను జుర్రుకోమని ఉద్బోధించే ఈ కాలానికి నమస్కరించుకుంటూ అందుకోండొక మిగలపండిన మామిడిపండు. పిల్లలకు ఇవ్వండి. మామిడి బాల్యమే తియ్యని బాల్యం.


## బండి భగీరథ్ అరెస్టు విషయంలో రేవంత్ రెడ్డి అలా, బండి సంజయ్ ఇలా

మొదటిపేజీ తరువాయి - బండి భగీరథ్ లొంగిపోయాడని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ చెబితే, పోలీసులే అరెస్టు చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆయన లొంగుబాటు అంటే, ఈయన అరెస్టు అని చెప్పడం విడ్డూరమని అన్నారు. ఇద్దరు తోడు దొంగలని, వారు కలిసి డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి హైట్ ఒక్కటే తక్కువ అనుకున్నానని, కానీ బుర్ర కూడా తక్కువేనని ఎద్దేవా చేశారు.బండి భగీరథ్‌కు ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేశారని, కానీ హైకోర్టులో అనుకూలంగా తీర్పు రాలేదని కేటీఆర్ తెలిపారు. ఒక అమ్మాయికి అన్యాయం జరిగితే ఆ అమ్మాయి వివరాలు బయటపెట్టింది బీజేపీవారే అన్నారు. పేట్ బషీరాబాద్‌లో 15 మందిపై కేసులు నమోదయ్యాయని, వారంతా బీజేపీవారే అన్నారు.ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ పర్యటనకు వచ్చి చావు కబురు చల్లగా చెప్పారని విమర్శించారు. రైతులు యూరియా ఉపయోగించడం తక్కువ చేయాలని, ప్రజలు బంగారం కొనుగోలు తగ్గించాలని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత కాలం వచ్చే సీజన్‌లో కూడా రైతులకు ఇబ్బంది తప్పదని అన్నారు. రాష్ట్రంలో గన్నీ బ్యాగులు దొరకడం లేదు కానీ గన్‌లు మాత్రం బాగా దొరుకుతున్నాయని కేటీఆర్ విమర్శించారు.

## ప్రభుత్వ ఖజానాకు ఆర్బీఐ బూస్ట్

మొదటిపేజీ తరువాయి - లక్షల కోట్లకు పైగా ఉండవచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇది ప్రభుత్వ ఆర్థిక నిర్వహణకు పెద్ద ఊరటనివ్వనుంది.గతేడాది ఆర్బీఐ రూ.2.68 లక్షల కోట్ల రికార్డు స్థాయి డివిడెండ్‌ను ప్రభుత్వానికి బదిలీ చేసింది. ఈసారి అంతకుమించి సుమారు రూ.2.8 లక్షల కోట్ల నుంచి రూ.3.3 లక్షల కోట్ల మధ్య డివిడెండ్ ఉండవచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎంకే గ్లోబల్ వంటి సంస్థలు అంచనా వేస్తున్నాయి. పన్నేతర ఆదాయం రూపంలో అందే ఈ భారీ మొత్తం, ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల నడుమ ప్రభుత్వానికి ఎంతగానో తోడ్పడనుంది. మార్కెట్ నుంచి అదనపు రుణాలు సమీకరించాల్సిన అవసరం లేకుండా ఆర్థిక లోటును అదుపులో ఉంచేందుకు ఇది కీలకం కానుంది. 2026-27 కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వ రంగ సంస్థల నుంచి, ఆర్బీఐ నుంచి డివిడెండ్ల రూపంలో రూ.3.16 లక్షల కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది.ఈసారి అధిక డివిడెండ్‌కు ప్రధాన కారణం 'కంటింజెన్సీ రిస్క్ బఫర్' (సీఆర్బీ)ను తగ్గించే అవకాశం ఉండటమేనని విశ్లేషకులు చెబుతున్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకనమిస్ట్ మదన్ సబ్నవిస్ మాట్లాడుతూ.. "గతేడాది విదేశీ మారక నిల్వల వినియోగం ద్వారా వచ్చిన అధిక ఆదాయం వల్ల డివిడెండ్ పెరిగింది. కానీ ఈసారి సీఆర్బీని తగ్గించడం ద్వారా మిగులు నిధులు పెరిగే అవకాశం ఉంది. ఈసారి డివిడెండ్ రూ.3-3.2 లక్షల కోట్ల మధ్య ఉండొచ్చు" అని వివరించారు.ఆర్బీఐ ఎకనమిక్ క్యాపిటల్ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం.. కంటింజెన్సీ రిస్క్ బఫర్‌ను 4.5 శాతం నుంచి 7.5 శాతం మధ్యలో నిర్వహించాలి. ప్రస్తుతం ఇది గరిష్ఠ స్థాయి అయిన 7.5 శాతం వద్ద ఉంది. దీనిని స్వల్పంగా 7 శాతానికి తగ్గించినా కూడా ప్రభుత్వానికి బదిలీ చేసేందుకు భారీగా నిధులు అందుబాటులోకి వస్తాయి. "అధిక వడ్డీ ఆదాయం, బఫర్ అవసరాలు తగ్గడం వంటి కారణాలు ఈసారి అధిక చెల్లింపులకు మద్దతుగా నిలుస్తాయి" అని ఎంకే గ్లోబల్ చీఫ్ ఎకనమిస్ట్ మాధవి అరోరా పేర్కొన్నారు. నేటి సమావేశం తర్వాత వెలువడనున్న అధికారిక ప్రకటనతో ఈ విషయంపై స్పష్టత రానుంది.

## హర్మ్యూజ్ మూసివేత మరింత కాలం కొనసాగితే చమురు ధరలు భారీగా పెరగొచ్చు!




మొదటిపేజీ తరువాయి - ముడి చమురు ధర 200 డాలర్లకు చేరుకుంటుందని తెలిపింది.అదే జరిగితే కనుక ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక మాంద్యానికి దారితీయవచ్చని హెచ్చరించింది. ఇరాన్, అమెరికా యుద్ధం ఫిబ్రవరి చివరలో ప్రారంభమైన విషయం తెలిసిందే. నాటి నుంచి ప్రపంచ ఇంధన మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నాయి. చమురు ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల పెంపు భయాలు నెలకొన్నాయి. ప్రస్తుతం గల్ఫ్ దేశాల నుంచి వచ్చే 11 మిలియన్ బ్యారెళ్ళ చమురు సరఫరా నిలిచిపోయింది.సుమారు 80 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇది ప్రపంచ ఎల్ఎన్‌జీ సరఫరాలో 20 శాతానికి సమానం. హర్మ్యూజ్ జలసంధి తెరుచుకోవడంపై అంతర్జాతీయ ఆయిల్, గ్యాస్, ధరలు, ఇంధన డిమాండ్లు ఆధారపడి ఉంటాయని ఉడ్ మెకంజీ పేర్కొంది. జూన్ నాటికి సమస్య తగ్గితే 2026 చివరినాటికి బ్రెంట్ క్రూడ్ ధర 80 డాలర్లకు, వచ్చే ఏడాదికి 65 డాలర్లకు తగ్గుతుందని అంచనా వేసింది.హర్మ్యూజ్ మూసివేత ఆగస్ట్ వరకు కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 2008 నాటి ఆర్థిక మాంద్యం పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని మరో ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ రాపిడాన్ ఎనర్జీ గ్రూప్ పేర్కొంది. ఆగస్టు లేదా అంతకంటే ఎక్కువ కాలం మూసివేస్తే మార్కెట్లో రోజుకు దాదాపు 6 మిలియన్ బ్యారెళ్ల ముడిచమురు కొరత ఏర్పడుతుందని, తద్వారా ప్రపంచవ్యాప్తంగా చమురు వినియోగం భారీగా పడిపోయే ప్రమాదం ఉందని తెలిపింది. చమురు ధరలు పెరిగితే ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగి, వృద్ధి మందగించే ముప్పు పొంచి ఉందని హెచ్చరించింది.

# అగ్నిగుండంలా ఆంధ్రప్రదేశ్

మొదటిపేజీ తరువాయి - సెలవులు ప్రకటించాలని దిశానిర్దేశం చేశారు.రాష్ట్రంలో తీవ్రస్థాయిలో నమోదు అవుతున్న ఉష్ణోగ్రతలు, వడ గాల్పుల నేపథ్యంలో ప్రజారోగ్యం, వారి భద్రతపై ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యవసర సమీక్ష నిర్వహించారు. తీవ్రస్థాయి ఎల్‌నినో కారణంగా హీట్ వేవ్ తీవ్రత కూడా గణనీయంగా పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజలకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేలా రద్దీగా ఉన్న ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా తిరిగే చోట్ల చల్లని మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సీఎం స్పష్టం చేశారు. వడగాలుల నుంచి ఎలా రక్షించుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్లు మీడియా సమావేశాలు నిర్వహించాలని చంద్రబాబు సూచించారు. మీడియాతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతరం సమాచారాన్ని చేరవేయాలని నిర్దేశించారు. ప్రజల ప్రాణాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎండ తీవ్రత నేపథ్యంలో బయటకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా ఉండాలని సూచించారు. ఈ అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి జిల్లా కలెక్టర్లు, మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 1349 హీట్ షెల్టర్లు, చలి వేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. 446 ట్రాఫిక్ జంక్షన్లలో వాహనదారులు, పోలీసులకు నీడ కల్పించేలా ఏర్పాట్లు చేశామన్నారు. మరోవైపు ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న మూగ జీవులు, పక్షులకు కూడా నీటి తొట్టెలు, మట్టి కుండలతో నీటిని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి కొరత రాకుండా చూడాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. నీటి ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. 2015లో బలమైన ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో 50.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డు అయ్యిందని, ఈ ఏడాదిలోనూ ఎల్ నినో ప్రభావంతో ఇప్పటి వరకూ 48 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు రాష్ట్రంలో నమోదు అయినట్టు అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు.గడిచిన మూడు రోజులుగా 45 డిగ్రీల నుంచి 48 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపుపై దృష్టి సారించాలని సీఎం చంద్రబాబు సూచించారు. భూగర్భ జలాలు పెరిగితే పచ్చదనం పెరుగుతుందని తద్వారా తీవ్ర ఉష్ణోగ్రతల ప్రభావం నుంచి కొంత మేర ఉపశమన లభిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. అన్నమయ్య జిల్లానే దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోందని వెల్లడించారు. ఇతర జిల్లాలతో పోలిస్తే అన్నమయ్య జిల్లాలో తక్కువ ఉష్ణోగ్రత నమోదైందని స్పష్టం చేశారు. తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాల్లో హెచ్చరికలు, అప్రమత్తత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సమాచారం చేరవేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు.వచ్చే వారం రోజుల పాటు నిత్యం ప్రజలను అప్రమత్తం చేసేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, పురపాలక, పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి, విపత్తు నిర్వహణ, వైద్యారోగ్య శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.ఎండలతో రాష్ట్రం భగ్గుమంటోంది. ఇల్లు దాటి బయటకొస్తేనే కాదు ఇంటి లోపలా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోయాయి. నిప్పుల కుంపటి ముందున్నట్లు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. 2 రోజులుగా పల్నాడు జిల్లా భగ్గుమం టోంది. రాష్ట్రంలోనే అత్యధికంగా పిడుగురాళ్లలో బుధవారం 47.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైతే గురువారం ఏకంగా 48.1 డిగ్రీలకు చేరింది. ఇదే జిల్లా అచ్చం పేటలోనూ 47.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రానికైనా వాతావరణం మారుతుందని ఆశిస్తున్న ప్రజలకు రాత్రయినా ఉక్కపోతలు తగ్గట్లేదు.

## మా బ్రాండ్ ఉద్యోగాల కల్పన అయితే, మీ బ్రాండ్ గొడ్డలి

మొదటిపేజీ తరువాయి - చేసిన సభలో లోకేష్ మాట్లాడుతూ, "మా నాన్న ఉత్తరం రాశారు, మా తాత కల కన్నారు, నేను ఆత్మలతో మాట్లాడాను అంటే ఇప్పుడు నమ్మేవాళ్ళు ఎవరూ లేరు బ్రదర్. మా బ్రాండ్ జాబ్ క్రియేషన్ అయితే... మీ బ్రాండ్ గొడ్డలి" అంటూ పరోక్షంగా విమర్శలు గుప్పించారు.రికార్డు సమయంలో ఎస్ఏఈఎల్ ప్రాజెక్టు పూర్తి కావడం స్థానిక రైతుల, జమ్మలమడుగు యువత విజయమని లోకేష్ ప్రశంసించారు. "మీ సహకారం వల్లనే ఈ భారీ ప్రాజెక్టు కేవలం 11 నెలల్లో పూర్తయింది. ఈరోజు రాష్ట్రం మొత్తం జమ్మలమడుగు వైపు చూస్తోంది. ఇక్కడ మెగా సోలార్ పార్క్, అదానీ, చింతా గ్రీన్, జెన్‌కోఎన్టీపీసీ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులతో పాటు ఇప్పుడు ఎస్ఏఈఎల్ ను కూడా తీసుకువచ్చింది మనమే. కంపెనీలు తేవాలన్నా, ఉద్యోగాలు కల్పించాలన్నా అది బ్రాండ్ సీబీఎన్‌కే సాధ్యం" అని లోకేష్ అన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పన విజయవంతం కావడానికి మూడు ముఖ్య కారణాలు ఉన్నాయని లోకేష్ వివరించారు. "మొదటిది బ్రాండ్ సీబీఎన్. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నాయకత్వం ఉండటంతో పెట్టుబడిదారులు ఏపీ వైపు చూస్తున్నారు. రెండవది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. వేగంగా నిర్ణయాలు తీసుకుని, ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడం మా విధానం. ఈ ప్రాజెక్టే దానికి నిదర్శనం. మూడవది డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ మద్దతుతో రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతోంది" అని ఆయన పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్‌వేర్, డ్రోన్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో 22 ప్రత్యేక గ్రోత్ క్లస్టర్లను నిర్మిస్తున్నామని లోకేష్ తెలిపారు. "ఆధునిక ఆర్థిక వ్యవస్థకు ఆవిష్కరణలే కీలకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి భవిష్యత్తు కోసం ప్రపంచంతో పోటీపడే ఎకోసిస్టమ్‌లను నిర్మిస్తున్నాయి" అని ఆయన వివరించారు.ఎస్ఏఈఎల్ సంస్థతో తన తొలి పరిచయాన్ని లోకేష్ గుర్తుచేసుకున్నారు. "ఢిల్లీలో ఒక టెలికాం ఆపరేటర్ల సమావేశంలో ఎస్ఏఈఎల్ నాయకత్వాన్ని కలిశాను. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులపై వారికున్న ఉత్సాహం, దీర్ఘకాలిక ప్రణాళిక నన్ను ఆకర్షించింది. వారి తపనను నేను వెంటనే గ్రహించగలిగాను" అని ఆయన నాటి సంఘటనను వివరించారు.పంజాబ్ కేంద్రంగా పనిచేసే ఒక కంపెనీ ఏపీలో విజయవంతం కాగలదా అనే సందేహం మొదట కలిగిందని, కానీ ఎస్ఏఈఎల్ బృందం క్షేత్రస్థాయిలో స్థానిక సమాజంతో మమేకమై పనిచేయడం చూశాక ఆ సందేహం తొలగిపోయిందని లోకేష్ అన్నారు. "వారు రైతులు, గ్రామస్థులు, అధికారులు, కార్మికులతో కలిసికట్టుగా పనిచేసి, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని ముందుకు సాగారు. ఆ స్ఫూర్తే ఈ ప్రాజెక్టు విజయానికి కారణం," అని ఆయన ప్రశంసించారు.నాజుజూ సంస్థ రూ.3,000 కోట్ల పెట్టుబడితో, 2,400 ఎకరాల విస్తీర్ణంలో రెండు భారీ 300 మెగావాట్ల ప్రాజెక్టులను కేవలం 11 నెలల్లో పూర్తి చేసి రికార్డు సృష్టించిందని లోకేష్ తెలిపారు. పంజాబ్, రాజస్థాన్‌లోని ఎస్ఏఈఎల్ సొంత ప్లాంట్లలో తయారైన 12 లక్షలకు పైగా అత్యాధునిక సోలార్ మాడ్యూళ్లను ఈ ప్రాజెక్టులో వినియోగించారు.ఈ ఒక్క ప్రాజెక్టుతోనే ఏటా సుమారు 11 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను నివారించవచ్చని అంచనా. ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను 25 ఏళ్ల ఒప్పందం ప్రకారం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా జాతీయ గ్రిడ్‌కు సరఫరా చేస్తారు. "ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు కేవలం క్లీన్ ఎనర్జీని వినియోగించడమే కాదు, దేశానికి ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతోంది. భారతదేశ హరిత ఇంధన విప్లవానికి ఏపీ నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉంది," అని లోకేష్ స్పష్టం చేశారు. ఎస్ఏఈఎల్ బృందాన్ని ఉద్దేశించి "తుస్సీ కమాల్ కర్ దిట్టా... చక్ దే ఫట్టే!" అంటూ పంజాబీలో అభినందించారు.ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే 1,000 మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించిందని, వీరిలో 80 శాతం స్థానికులేనని లోకేష్ చెప్పారు. 760 మంది రైతులకు దీర్ఘకాలిక లీజు ఒప్పందాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. వ్యవసాయ వ్యర్థాల నుంచి కూడా విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టులను ఎస్ఏఈఎల్ చేపడుతోందని, దీనివల్ల రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఎస్ఏఈఎల్ సంస్థకు ఎలాంటి మద్దతు కావాలన్నా తాను ఒక వాట్సాప్ కాల్ దూరంలోనే ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, సవిత, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్ఏఈఎల్ కో-ఫౌండర్ సుఖ్ భీర్ సింగ్, సీఈవో లక్షిత్ ఆవ్లా, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, టీడీపీ ఇంఛార్జ్ భూపేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లోక్ సభ సీట్లపై నారా లోకేష్ వర్సెస్ షర్మిల

మొదటిపేజీ తరువాయి - చేసి, మెరుగైన మానవాభివృద్ధి సూచికలను సాధించిన దక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా శిక్షించకూడదన్నదే తమ పార్టీ స్పష్టమైన వైఖరి అని ఆమె పునరుద్ఘాటించారు. కేవలం లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు రక్షణ లభించదని, పార్లమెంటులో వాటి సాపేక్ష ప్రాతినిధ్యం, రాజకీయ పలుకుబడి తగ్గకుండా చూడటమే అసలైన సవాల్ అని ఆమె అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత పి.చిదంబరం ట్వీట్ కు బదులిస్తూ నారా లోకేష్ చేసిన పోస్ట్ పై షర్మిల ఈ విధంగా స్పందించారు.ఈ అంశంపై శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. "దక్షిణాది రాష్ట్రాల గొంతుకను తగ్గించే ఎలాంటి పునర్విభజన ప్రక్రియనైనా కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ వ్యతిరేకిస్తోంది. దీనిపై తిరుగులేని రాజ్యాంగ హామీ ఉండాలని మేం డిమాండ్ చేశాం. ఆర్టికల్ 81 ప్రకారం చూస్తే, ఆంధ్రప్రదేశ్‌కు సంఖ్యాపరంగా సీట్లు పెరిగినా, అధిక జనాభా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్య బలం, నిర్ణయాధికారం తగ్గిపోయే ప్రమాదం ఉంది," అని షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ సమస్యకు ప్రత్యామ్నాయాలను అన్వేషించడంలో విఫలమైందని ఆమె ఆరోపించారు. "రాజ్యాంగ నిపుణులు సూచించినట్లుగా స్థానిక సంస్థలను బలోపేతం చేయడం, రాష్ట్రాలకు, స్థానిక సంస్థలకు మరిన్ని ఆర్థిక, పరిపాలనా అధికారాలు ఇవ్వడం, వికేంద్రీకరణను ప్రోత్సహించడం వంటి మార్గాలను కేంద్రం ఏమాత్రం పట్టించుకోలేదు. కేవలం లోక్‌సభ సీట్లను పెంచడమే ఏకైక పరిష్కారంగా చూపింది," అని ఆమె పేర్కొన్నారు.నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో పార్లమెంటు సమావేశాల రోజుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, ఇప్పటికే జాతీయ చర్చల్లో దక్షిణాది రాష్ట్రాల వాణిని అణచివేస్తున్నారని షర్మిల విమర్శించారు. "సమాఖ్య సమతౌల్యాన్ని, పార్లమెంటరీ పనితీరును కాపాడకుండా సభను విస్తరిస్తే, వ్యక్తిగత ప్రాతినిధ్యం, అర్థవంతమైన చర్చ మరింత బలహీనపడతాయి. దక్షిణాది రాజకీయ ప్రాబల్యాన్ని శాశ్వతంగా కాపాడతామని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ఎప్పుడూ స్పష్టమైన రాజ్యాంగ హామీ ఇవ్వలేదు. ఒకప్పుడు సమాఖ్య స్ఫూర్తి కోసం, దక్షిణాది ప్రయోజనాల కోసం పోరాడిన టీడీపీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు, దక్షిణాదికి ఎలాంటి రక్షణలు కోరకుండా బీజేపీ అస్పష్ట వైఖరిని సమర్థించడం విడ్డూరంగా ఉంది," అని ఆమె అన్నారు. సమాఖ్య సమతౌల్యాన్ని, దక్షిణాది ప్రాతినిధ్యాన్ని, సహకార సమాఖ్య స్ఫూర్తిని కాపాడటమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, మెరుగైన పాలన అందించిన రాష్ట్రాలను రాజకీయంగా శిక్షించే వ్యవస్థగా భారత ప్రజాస్వామ్యం మారకూడదని షర్మిల స్పష్టం చేశారు. ఈ మేరకు నారా లోకేష్ చేసిన ఓ ట్వీట్ ను ఆమె రీపోస్ట్ చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై ఏపీ మంత్రి నారా లోకేష్, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత చిదంబరంను లక్ష్యంగా చేసుకుని పలు కీలక ప్రశ్నలు సంధించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 81 ప్రకారం 1971 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ సీట్ల కేటాయింపు జరిగిందని, ఆ నిబంధన 2026 తర్వాత జరిగే తొలి జనాభా గణనతో ముగియనుందని ఆయన గుర్తుచేశారు. ఈ పరిణామం దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు చిదంబరంను ఉద్దేశించి లోకేష్ ట్వీట్ చేశారు."డియర్ సర్... భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 81 ప్రకారం, లోక్‌సభలో రాష్ట్రాల సీట్ల కేటాయింపు 1971 జనాభా లెక్కల ఆధారంగా నిలిపివేయబడిందన్న విషయం మీకు తెలియంది కాదు. 2026 తర్వాత జరిగే మొదటి జనాభా గణనతో ఈ నిలుపుదల ముగుస్తుంది. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరిగా జరుగుతుంది.దీనివల్ల దక్షిణాది రాష్ట్రాలన్నీ, ఒక్కటి కూడా మినహాయింపు లేకుండా, ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే పార్లమెంటులో తమ ప్రాతినిధ్యాన్ని కోల్పోతాయి. ఈ అసమతుల్యత గురించే మేము మొదటి నుంచి ఆందోళన వ్యక్తం చేస్తున్నాం. ఈ సమస్యను పరిష్కరించేందుకే ఎన్డీయే ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును, అన్ని రాష్ట్రాలకు దామాషా ప్రకారం సీట్లు పెంచే ప్రతిపాదనను ముందుకు తెచ్చింది.మీలాంటి న్యాయ నిపుణులకు ఈ రాజ్యాంగపరమైన అంశాలు పూర్తిగా తెలుసు. మరి అలాంటప్పుడు, పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ ఆ బిల్లును ఎందుకు వ్యతిరేకించింది? దక్షిణాది దీర్ఘకాలిక ప్రయోజ నాలను పణంగా పెట్టి రాజకీయ లబ్ధి పొందడా నికేనా?కాంగ్రెస్ పార్టీ మా సూటి ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. ఆర్టికల్ 81 ప్రకారం 2026 తర్వాత ఏం జరుగుతుంది? ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాది ప్రాతినిధ్యాన్ని కోల్పోవడం నిజం కాదా? అదే నిజమైన పుడు, ఆ నష్టాన్ని నివారిం చడానికి ఉద్దేశించిన రాజ్యాం గబద్ధమైన ప్రక్రియను మీరెందుకు వ్యతిరేకించారు?" అని లోకేష్ ప్రశ్నల వర్షం కురిపించారు.

# తెలంగాణలో అంగన్‌వాడీ కొలువులు

మొదటిపేజీ తరువాయి - తెలంగాణలోని నిరుద్యోగ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న భారీ సంఖ్యలో పోస్టులను భర్తీ చేసేందుకు వేగంగా కసరత్తు చేస్తోంది. మొత్తం 15,982 టీచర్, హెల్పర్ పోస్టుల భర్తీకి ఈ ఏడాదిలోనే నోటిఫికేషన్ జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నియామకాలతో అంగన్‌వాడీ కేంద్రాల సేవలను బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.ప్రస్తుతం రాష్ట్రంలో 35,781 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో 22.33 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 2025-26 నాటికి పదవీ విరమణలు, సిబ్బందికి సూపర్‌వైజర్లుగా పదోన్నతులు రావడం, కొందరు ఇతర ప్రభుత్వ శాఖల్లో శాశ్వత ఉద్యోగాలు సాధించడం వంటి కారణాలతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. మొత్తం 15,982 పోస్టులలో 12,882 హెల్పర్ పోస్టులు, 3,100 టీచర్ పోస్టులు ఉన్నాయి. వీటికి అదనంగా కొత్తగా ఏర్పడిన 708 ఉద్యోగాలను కూడా కలిపి ఈ నియామక ప్రక్రియ చేపట్టనున్నారు.ఈ నియామక ప్రక్రియను జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దీనికి ముందుగా రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ విద్యా అర్హతలు, ఎంపిక విధానంపై స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించనుంది. కొత్త నియామక విధానానికి ప్రభుత్వ ఆమోదం లభించిన వెంటనే జిల్లాల వారీగా నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి. స్థానిక మహిళలకు ఈ ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది.కేవలం ఉద్యోగాల భర్తీకే పరిమితం కాకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా, 9,000 కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్లు, 7,700 కేంద్రాలకు మరుగుదొడ్లు, 5,000 కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లు, ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అలాగే, వెయ్యి కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించి, 3,300 కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. ఈ భారీ నియామక ప్రక్రియతో అంగన్‌వాడీ సేవలు మరింత మెరుగుపడతాయని, నిరుద్యోగ మహిళలకు ఇది ఒక గొప్ప అవకాశమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## కొత్త వేగాన్ని అందించడానికి రెడీ

మొదటిపేజీ తరువాయి -

భారత్-సైప్రస్ వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుతో ఇరుదేశాల సంబంధాలకు కొత్త ఆశయాలు, కొత్త వేగాన్ని అందించడానికి సిద్ధమయ్యామని చెప్పారు. మే 20 నుంచి భారత పర్యటనలో ఉన్న సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్, శుక్రవారం దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఈ ద్వైపాక్షిక సమావేశం అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో భారత ప్రధాని ప్రసంగించారు.గత దశాబ్ద కాలంలో భారత్‌లోకి సైప్రస్ పెట్టుబడులు దాదాపు రెట్టింపు అయ్యాయని, ఇది ఇరుదేశాల మధ్య పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని నరేంద్ర మోదీ తెలిపారు. ఇటీవలె భారత్- యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అనేది రాబోయే రోజుల్లో భారత్ - సైప్రస్‌లకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దీని ఊతంతో రాబోయే ఐదేళ్లలో పెట్టుబడులను రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని ఇరుదేశాలు పెట్టుకున్నాయని చెప్పారు.భారత్, సైప్రస్‌లు డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఫిన్‌టెక్ నిర్వాహక వ్యవస్థలు, రీసెర్చ్ హబ్‌లు వంటి విభాగాలతో ముడిపడిన పలు అవగాహనా ఒప్పందాల (ఎంఓయూ)పై సంతకాలు చేశాయని ప్రధాని వెల్లడించారు. సంస్థాగత సహకారాలు, విద్యార్థి మార్పిడి కార్యక్రమాలు, ఉమ్మడి శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహిం చడంపైనా ఎంఓయూలు కుదిరాయన్నారు. ఇరుదేశాల మధ్య చట్టబద్ధమైన వలసలను ప్రోత్సహించే, అక్రమ వలసలను అరికట్టే ఒప్పందం ఖరారుకు దృఢమైన ఏకాభిప్రాయాన్ని సాధించడంపైనా ఫోకస్ పెట్టాలని నిర్ణయించినట్లు మోదీ తెలిపారు. భారత్- సైప్రస్ మధ్య రాకపోకలు సాగించే వృత్తి నిపుణుల హక్కుల పరిరక్షణకు త్వరలోనే ఒక సామాజిక భద్రతా ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని నిర్ణయించా మన్నారు."ఉగ్రవాదం కట్టడి కోసం ఒక జాయింట్ వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేసే అంశంపై భారత్- సైప్రస్ మధ్య ఎంఓయూ కుదిరింది. తీవ్రవాద భావజాలం, సరిహద్దు ముప్పులను ఎదుర్కోవడానికి ఈ జాయింట్ వర్కింగ్ గ్రూప్ పనిచేస్తుంది. సైబర్ భద్రత, సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధక నెట్‌వర్క్‌ల బలోపేతం, లక్షిత రక్షణ విస్తరణలలోనూ ఇరుదేశాలు కలిసి పనిచేస్తాయి. భారత్, సైప్రస్‌ల మధ్య స్నేహం బలమైనది. ఇది భవిష్యత్ దృష్టితో కూడుకున్నది. ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలన వంటి విలువలకు కట్టుబడి ఉండాలనే ఉమ్మడి నిబద్ధతపై మా భాగస్వామ్యం ఆధారపడి ఉంది. మేం అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను ప్రగాఢంగా గౌరవిస్తాం. ఈ సూత్రాలను పరిరక్షించడానికి భారతదేశం కట్టుబడి ఉంది" అని ప్రధాని మోదీ తెలిపారు. పయత్నాలకు తమ మద్దతు ఉంటుందని సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ప్రకటించారు. నేటి ప్రపంచ వాస్తవికతలను ప్రతిబింబించేలా భద్రతా మండలి నిర్మాణంలో మార్పులు జరగాలన్నారు. ప్రపంచ వ్యవహారాల్లో పెరుగుతున్న భారత్ పాత్రకు కూడా తమ మద్దతు ఉంటుందని ఆయన తేల్చి చెప్పారు. సైప్రస్‌ను తిరిగి ఏకీకృతం చేసే ప్రయత్నాలకు భారత్ అందిస్తున్న దీర్ఘకాలిక మద్దతును తాము ఎంతగానో గౌరవిస్తామన్నారు. సైప్రస్ గణతంత్ర రాజ్య స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు స్థిరమైన మద్దతును అందిస్తున్న భారత్‌కు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ధన్యవాదాలు తెలియజేశారు.

# ఘోరం.. నలుగురు మహిళలను వేటాడి చంపిన పులి!

**మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా అడవుల్లో ఉదంతం**

**బీడీ ఆకులు ఏరుకుంటుండగా పులి దాడి**

**తప్పించుకునే ఛాన్స్ ఇవ్వకుండా మాటువేసి వేట**

**ఘటనా స్థలంలోనే నలుగురి ప్రాణాలు విడిచిన వైనం**

**రంగంలోకి దిగిన ఫారెస్ట్ రేంజ్ అధికారులు**



మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో ఘోరం జరిగింది. అడవికి వెళ్లిన నలుగురు మహిళలపై పులి దాడి చేసి ప్రాణాలు తీసింది. గంజేవాహి అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం జరిగిన ఈ ఘటనతో చుట్టుపక్క గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఆకులు ఏరుకుంటుండగాచంద్రపూర్ జిల్లా సిందేవహి తాలుకా పరిధిలోని గ్రామీణ ప్రజలు ప్రతిరోజూ ఉదయాన్నే అడవికి వెళ్లడం అలవాటు. అక్కడ దొరికే ఎండిపోయిన బీడీ ఆకులను ఏరుకుని జీవనం సాగిస్తుంటారు. శుక్రవారం ఉదయం కూడా గంజేవాహి ప్రాంతానికి చెందిన కొందరు మహిళలు అడవిలోకి వెళ్లారు. ఉదయం 8 గంటల సమయంలో వీరంతా ఆకులు ఏరుకోవడంలో నిమగ్నమై ఉండగా పులి ఒక్కసారిగా వీరిపై దాడి చేసింది. క్షణాల వ్యవధిలోనేమహిళలు గమనించే లోపే పులి వారిపై భయంకరంగా విరుచుకుపడింది. ప్రత్యక్ష సాక్షులు చెప్పిన దాని ప్రకారం.. మహిళలకు కనీసం తప్పించుకునే లేదా కేకలు వేసే అవకాశం కూడా ఇవ్వకుండా వేటాడింది. దీంతో తీవ్ర గాయాలైన నలుగురు మహిళలు ఘటనా స్థలంలోనే చనిపోయారు. గ్రామాల్లో ఉద్రిక్తతఈ ఘోర ప్రమాదం జరిగిన వెంటనే అటవీ ప్రాంతం చుట్టుపక్క ఉన్న గ్రామాల్లో తీవ్ర కలకలం రేగింది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి అంజలీ సాయంకర్ తన సిబ్బందితో కలిసి వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే ఒకేసారి నలుగురు మహిళలు పులి దాడిలో బలికావడంతో అటవీ శాఖ నిర్లక్ష్యంపై గ్రామీణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పులిని వెంటనే బంధించాలని డిమాండ్ చేస్తున్నారు.

# బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తాం

**హరీశ్ రావు ఫార్మా సిటీని మళ్లీ పునరుద్ధరిస్తామని వెల్లడి**

**అమెరికా పర్యటనలో వ్యాఖ్యలు**

**16 వేల ఎకరాల భూసేకరణ పూర్తైందని వెల్లడి**

**కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులూ వచ్చాయన్న మాజీ మంత్రి**

**వేరే అవసరాలకు వాడితే భూములు వెనక్కి ఇవ్వాలని డిమాండ్**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్‌పై బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆయన అక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భూములను రైతులకు ఇచ్చేయాలిగత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'ఫార్మా సిటీ'ని మళ్లీ పునరుద్ధరిస్తామని హరీశ్ తెలిపారు. ఫార్మా సిటీ కోసం తాము 16 వేల ఎకరాల భూసేకరణ చేశామన్నారు. దానికి కేంద్ర పర్యావరణ శాఖ నుంచి అన్ని క్లియరెన్సులు కూడా వచ్చాయని వెల్లడించారు. ఏ ఉద్దేశంతోనైతే రైతుల దగ్గర నుంచి భూములు తీసుకున్నామో దానికి భిన్నంగా భూమిని వేరే అవసరాల కోసం వాడితే ఆ ల్యాండ్‌ను తిరిగి రైతులకే ఇచ్చేయాలని చట్టం చెబుతోందని తెలిపారు. ఫార్మా సిటీని రద్దు చేసి వేరే ప్రాజెక్ట్ పెడితే చట్ట ప్రకారం ఆ భూములను రైతులకు వెనక్కి ఇచ్చేయాల్సి ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని విమర్శించారు. కోర్టులో ప్రభుత్వం అబద్ధాలుఫార్మా సిటీని రద్దు చేయడం లేదని రేవంత్ సర్కార్ హైకోర్టులో కేసు విచారణ సందర్భంగా అబద్ధాలు చెప్పిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఓవైపు కోర్టుకు ఫార్మా సిటీ కొనసాగిస్తామని చెబుతూనే మరోవైపు ఫ్యూచర్ సిటీ అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. ఫార్మా సిటీ ద్వారా లక్షలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు వస్తాయని చట్ట ప్రకారం దాన్నే కొనసాగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# పెళ్లికి వెళ్లి తిరిగిరాని కుటుంబం, 26 ఏళ్ల తర్వాత వీడిన మిస్టరీ!

**పంజాబ్‌లోని భాక్రా కాలువలో మారుతీ వ్యాన్, నాలుగు అస్థిపంజరాల లభ్యం**

**2000వ సంవత్సరంలో అదృశ్యమైన మునిలాల్ కుటుంబ సభ్యులుగా గుర్తింపు**

**స్థానిక డైవర్ చొరవతో వెలుగులోకి వచ్చిన దశాబ్దాల నాటి విషాదం**

దాదాపు 26 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. పాతికేళ్ల క్రితం పెళ్లికి వెళ్లి అదృశ్యమైన ఒకే కుటుంబానికి చెందిన నలుగురి ఆచూకీ ఎట్టకేలకు లభించింది. అయితే, వారు జీవించి లేరని తెలియడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. పంజాబ్‌లోని రూప్‌నగర్ జిల్లా, కిరాత్‌పూర్ సాహిబ్ సమీపంలోని భాక్రా కాలువలో ఒక పాత మారుతీ ఓమ్ని వ్యాన్‌తో పాటు నాలుగు అస్థిపంజరాలను అధికారులు వెలికితీయడంతో ఈ దశాబ్దాల నాటి మిస్టరీ వీడింది. అసలేం జరిగిందంటే..!కిరాత్‌పూర్ సాహిబ్ సమీపంలోని కోట్లా గ్రామానికి చెందిన మునిలాల్, తేజ్ రామ్, సుర్జిత్ సింగ్, ఎనిమిదేళ్ల బాలుడు కాలు... 2000వ సంవత్సరం అక్టోబర్ 20న ఒక వివాహ వేడుకకు మారుతీ ఓమ్ని వ్యాన్‌లో వెళ్లి తిరిగి రాలేదు. అప్పట్లో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కలిసి పెద్ద ఎత్తున గాలింపు చేపట్టారు. ఇతర రాష్ట్రాల నుంచి గజ ఈతగాళ్లను పిలిపించి, లక్షల రూపాయలు ఖర్చు చేసి భాక్రా కాలువ పరిసరాల్లో వెతికారు. అయినా వ్యాన్ గానీ, అందులోని వారి ఆచూకీ గానీ లభించలేదు. కాలక్రమేణా ఈ కేసు మరుగునపడిపోయింది. అయితే, ఇటీవల స్థానిక డైవర్ కమల్‌ప్రీత్ సైనీ నీటి అడుగున గాలిస్తుండగా 32 అడుగుల లోతులో ఉన్న ఒక పాత వాహనం కనిపించింది. అధికారులకు సమాచారం అందించడంతో ఆ వ్యాన్‌ను బయటకు తీశారు. లోపల నాలుగు అస్థిపంజరాలతో పాటు స్కూల్ యూనిఫాంను పోలిన ఒక షర్టు లభించింది. దాని ఆధారంగా బంధువులు మృతులను గుర్తించారు. ఈ ఘటనపై మృతుడు మునిలాల్ భార్య సీతా దేవి మాట్లాడుతూ.. "పెళ్లికి వెళ్లిన వారు తిరిగి రాకపోవడంతో అప్పట్లో అన్నిచోట్లా వెతికాం. మా ఆస్తులన్నీ అమ్ముడైపోయాక గాలింపు ఆపేశాం. ఇన్నేళ్ల తర్వాత మా వాళ్ల అవశేషాలను కనుగొనడంలో సహాయపడిన డైవర్ కమల్‌ప్రీత్‌కు ధన్యవాదాలు" అని ఆవేదన వ్యక్తం చేశారు. మునిలాల్ కుమారుడు గురువిందర్ మాట్లాడుతూ, తమ తండ్రి అదృశ్యంతో కుటుంబం ఎన్నో ఏళ్లుగా మానసిక ప్రశాంతతను కోల్పోయిందని, ఇప్పుడు అవశేషాలు దొరకడంతో కొంత ఊరట లభించిందని తెలిపారు. అధికారికంగా మరణ ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ప్రభుత్వ సహాయం కూడా అందక ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడ్డామని బంధువు సందీప్ సింగ్ వాపోయారు. అప్పట్లో గాలింపు కోసం సుమారు రూ. 1.5 లక్షలు ఖర్చు చేశామని, కాలువలో నీటి ప్రవాహం బలంగా ఉండటంతో వాహనం కొట్టుకుపోయి ఉంటుందని భావించామని, కానీ ప్రమాదం జరిగిన చోటే అది దొరకడం ఆశ్చర్యంగా ఉందని మరో బంధువు రామ్ కుమార్ అన్నారు. కుటుంబ సభ్యులు మత సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించి, అస్థికలను నిమజ్జనం చేశారు. ఈ ఘటనతో తమ కుటుంబానికి ఇన్నేళ్లకు కాస్త శాంతి లభించిందని వారు తెలిపారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# తెలంగాణలో అంగన్‌వాడీ కొలువులు

**15,982 పోస్టుల భర్తీకి సర్కార్ సన్నాహాలు**

**మొత్తం ఖాళీల్లో 12,882 హెల్పర్, 3,100 టీచర్ పోస్టులు**

**ఈ ఏడాదిలోనే కలెక్టర్ల ఆధ్వర్యంలో నియామక ప్రక్రియ ప్రారంభం**

**త్వరలో విడుదల కానున్న నియామక మార్గదర్శకాలు**


తెలంగాణలోని నిరుద్యోగ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న భారీ సంఖ్యలో పోస్టులను భర్తీ చేసేందుకు వేగంగా కసరత్తు చేస్తోంది. మొత్తం 15,982 టీచర్, హెల్పర్ పోస్టుల భర్తీకి ఈ ఏడాదిలోనే నోటిఫికేషన్ జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నియామకాలతో అంగన్‌వాడీ కేంద్రాల సేవలను బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. భారీగా ఖాళీల గుర్తింపుప్రస్తుతం రాష్ట్రంలో 35,781 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో 22.33 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 2025-26 నాటికి పదవీ విరమణలు, సిబ్బందికి సూపర్‌వైజర్లుగా పదోన్నతులు రావడం, కొందరు ఇతర ప్రభుత్వ శాఖల్లో శాశ్వత ఉద్యోగాలు సాధించడం వంటి కారణాలతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. మొత్తం 15,982 పోస్టులలో 12,882 హెల్పర్ పోస్టులు, 3,100 టీచర్ పోస్టులు ఉన్నాయి. వీటికి అదనంగా కొత్తగా ఏర్పడిన 708 ఉద్యోగాలను కూడా కలిపి ఈ నియామక ప్రక్రియ చేపట్టనున్నారు. నియామక ప్రక్రియ ఇలా..ఈ నియామక ప్రక్రియను జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దీనికి ముందుగా రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ విద్యా అర్హతలు, ఎంపిక విధానంపై స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించనుంది. కొత్త నియామక విధానానికి ప్రభుత్వ ఆమోదం లభించిన వెంటనే జిల్లాల వారీగా నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి. స్థానిక మహిళలకు ఈ ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. మౌలిక సదుపాయాల కల్పనకేవలం ఉద్యోగాల భర్తీకే పరిమితం కాకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా, 9,000 కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్లు, 7,700 కేంద్రాలకు మరుగుదొడ్లు, 5,000 కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లు, ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అలాగే, వెయ్యి కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించి, 3,300 కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. ఈ భారీ నియామక ప్రక్రియతో అంగన్‌వాడీ సేవలు మరింత మెరుగుపడతాయని, నిరుద్యోగ మహిళలకు ఇది ఒక గొప్ప అవకాశమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కేటీఆర్ ను కలిసిన మాజీ ఎమ్మెల్యే మల్లయ్య

**హైదరాబాద్ నందినగర్ లోని నివాసంలో కేటీఆర్ ను కలిసిన కోదాడ మాజీ ఎమ్మెల్యే**

**పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదుపై చర్చించిన నేతలు**

**కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్ర స్థాయిలో ఎండగట్టాలన్న కేటీఆర్**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ నందినగర్ లో ఉన్న నివాసంలో కేటీఆర్‌ను కలిశారు. కోదాడ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, త్వరలో జరగనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంపై వీరి మధ్య చర్చ జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తిని మల్లయ్య యాదవ్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, అరాచకాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని సూచించారు. గ్రామీణ స్థాయి నుంచి పార్టీ పటిష్ఠ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యేకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు.

# రాజ్యసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

**ఏపీలో ఖాళీ అవుతున్న 4 రాజ్యసభ స్థానాలు!**

**జూన్, జులై నెలల్లో ముగియనున్న 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం**

**జూన్ 18న పోలింగ్.. అదే రోజున ఫలితాలు**

**ఏపీలో 4 స్థానాలు కూటమి ఖాతాలోకి వెళ్లడం లాంఛనమే**



దేశవ్యాప్తంగా ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాల భర్తీకి కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. జూన్, జులై నెలల్లో పదవీకాలం ముగియనున్న 10 రాష్ట్రాల్లోని మొత్తం 24 రాజ్యసభ స్థానాలకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన 4 కీలక స్థానాలు కూడా ఉన్నాయి. ఎన్నికల షెడ్యూల్:నోటిఫికేషన్ విడుదల – జూన్ 1నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ – జూన్ 8పోలింగ్, ఫలితాలు – జూన్ 18ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీ కానున్న 4 స్థానాలు ఇవే: అయోధ్య రామిరెడ్డి (గా=జూ)పిల్లి సుభాష్ చంద్రబోస్ పరిమళ్ నత్వానీ సానా సతీష్ బాబు గత ఉపఎన్నికలో ఎన్నికయ్యారు)ప్రస్తుత అసెంబ్లీ సంఖ్యాబలం ప్రకారం ఏపీలోని ఈ నాలుగు స్థానాలూ కూటమి ఖాతాలోకి వెళ్లడం లాంఛనమే. కాకపోతే కూటమిలో సీట్ల సర్దుబాటు, ఎవరెవరికి ఎన్ని సీట్లు అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ విడతలో జాతీయ రాజకీయాల్లోని అత్యంత కీలక నేతల రాజ్యసభ పదవీకాలం ముగుస్తుండటంతో ఈ ఎన్నికలపై అందరి దృష్టి పడింది. కర్ణాటక (4 స్థానాలు): ఇక్కడి నుంచి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడల పదవీకాలం ముగియనుంది. మధ్యప్రదేశ్ (3 స్థానాలు): కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ పదవీకాలం ముగియనుంది. ఇతర రాష్ట్రాల ఖాళీల వివరాలు: గుజరాత్ (4), రాజస్థాన్ (3), జార్ఖండ్ (2), మణిపూర్ (1), మేఘాలయ (1), అరుణాచల్ ప్రదేశ్ (1), మిజోరాం (1). సరిగ్గా జూన్ 18న ఒకేరోజు పోలింగ్ జరిపి, అదే రోజు సాయంత్రం ఫలితాలను కూడా ఈసీ ప్రకటించనుంది.

# తెలంగాణలోని ఈ 11 జిల్లాల్లో బయట అడుగుపెట్టొద్దు!

**వడదెబ్బతో రాష్ట్రవ్యాప్తంగా 17 మంది మృతి**

**పలుచోట్ల 46.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు**

**నల్గొండలో పొలంలో మంటల్లో చిక్కుకుని రైతు సజీవదహనం**

**కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు పడే అవకాశం**



తెలంగాణను భానుడు చెలరేగిపోతున్నాడు. నిప్పుల కొలిమిలా మారిన రాష్ట్రంలో ఎండల తీవ్రత రానున్న రోజుల్లో మరింత పెరగనుంది. శుక్రవారం రాష్ట్రంలోని 11 జిల్లాల్లో తీవ్ర వడగాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించింది. గురువారం రాష్ట్రంలో ఎండల తీవ్రత రికార్డు స్థాయికి చేరగా, వడదెబ్బ కారణంగా ఒక్కరోజే 17 మంది ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఉమ్మడి నల్గొండ, వరంగల్ జిల్లాల్లో నలుగురు చొప్పున, కరీంనగర్‌లో ముగ్గురు, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో ఇద్దరు చొప్పున మృత్యువాత పడ్డారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం, సూర్యాపేట జిల్లా మునగాలలో అత్యధికంగా 46.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అనేక ఇతర ప్రాంతాల్లో కూడా ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటాయి. ఎండల తీవ్రత ఒకవైపు అయితే.. అగ్నిప్రమాదాలు మరోవైపు పెను విషాదాన్ని మిగుల్చుతున్నాయి. నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలంలో వరి కొయ్యలకు నిప్పుపెడుతూ ప్రమాదవశాత్తు మంటల్లో చిక్కుకుని నూనెముంతల సత్తయ్య (72) అనే రైతు సజీవదహనమయ్యాడు. మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో పంట పొలాలకు నిప్పంటుకోవడంతో వందల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. హైదరాబాద్ పాతబస్తీలోని ఓ దుస్తుల దుకాణంలో జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు రూ. 2 కోట్ల ఆస్తి నష్టం సంభవించింది. ఎండల తీవ్రతకు మనుషులే కాదు, మూగజీవాలు కూడా బలైపోతున్నాయి. రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లోని కోళ్ల ఫారాల్లో వేడికి తట్టుకోలేక వందల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడ్డాయి. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల వల్ల కొత్తగూడెం, ఖమ్మం, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఒకవైపు భరించలేని ఎండలు, మరోవైపు అకాల వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతికి స్వల్ప ఊరటమధ్యంతర బెయిల్ మంజూరు

**ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న శాంతి**

**విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న శాంతి**

**ఐదు రోజుల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన ఏసీబీ కోర్టు**



ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, వివాదాస్పద అధికారిణి శాంతికి ఏసీబీ ప్రత్యేక కోర్టులో స్వల్ప ఉపశమనం లభించింది. ప్రస్తుతం విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆమెకు న్యాయస్థానం షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత కొన్ని రోజులుగా జైల్లో ఉన్న శాంతి, రెగ్యులర్ బెయిల్ కోసం ఇప్పటివరకు రెండుసార్లు పిటిషన్లు దాఖలు చేయగా... ఏసీబీ కోర్టు వాటిని పూర్తిగా కొట్టేసింది. అయితే, తాజాగా ఆమె తరపు న్యాయవాదులు దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు, ఈ నెల 23వ తేదీ (శనివారం) నుంచి 27వ తేదీ వరకు ఐదు రోజుల పాటు మాత్రమే ఆమెకు మధ్యంతర బెయిల్ ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఐదు రోజుల వ్యవధి ముగిసిన వెంటనే ఆమె తిరిగి కోర్టు ముందు హాజరై, జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. దేవదాయ శాఖలో భారీగా అవినీతికి పాల్పడి, కోట్లాది రూపాయల అక్రమాస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు ఆమె నివాసాలపై దాడులు చేసి, కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కోర్టు విధించిన షరతులకు లోబడి ఆమె జైలు నుండి తాత్కాలికంగా బయటకు రానున్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com